మల్కాజిగిరి లోక్‌సభ బరిలో 22 మంది అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బరిలో 22 మంది అభ్యర్థులు మిగిలారని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. పరిశీలన తర్వాత 37 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామన్నారు. ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా 15 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు వారి సమక్షంలో గుర్తులు(సింబల్) కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా సహకరించాలి

జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా అన్నారు. కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్‌లో పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, వ్యయ పరిశీలకులు ధృవ్ భోళా, మనోజ్ అలోస్ లత్రా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్‌తో కలిసి సోమవారం పార్టీల ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధి విధానాలను వివరించారు. జిల్లాలో ఫ్లయింగ్ స్కాడ్ టీమ్‌లు పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార ఖర్చులో వాటిని లెక్కించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల రాజకీయ ప్రకటనలు వంటివి సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంల వద్ద పటిష్ఠ భద్రత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అనంతరం అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా అన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి హోలీ మేరీ కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన అసెంబ్లీ నియోజకవర్గాలైన మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ఈవీఎంలను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టి పనులు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

'కవులు, రచయితలు, కళాకారులపై దాడులు హేయం'

పంజగుట్ట: వరంగల్‌లో కవులు, రచయితలు, కళాకారులపై జరిగిన దాడులు ఫాసిజానికి పరాకాష్ట అని సెక్యులర్ రైటర్స్ ఫోరం బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు గురైన కేంద్ర యువ సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు, నరేష్ కుమార్ సూఫీ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాకతీయ యూనివర్సిటీలో సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో లౌకిక విలువలు-సాహిత్యం అనే అంశంపై సదస్సు నిర్వహించామన్నారు. వీసీ అనుమతితో, యూనివర్సిటీ ఉన్నతాధికారులు కూడా సదస్సుకు హాజరయ్యారన్నారు. సదస్సు జరుగుతుండగా కొంతమంది ఏబీవీపీ కార్యకర్తలు ఒక్కసారిగా అక్కడికొచ్చి మీకు అనుమతి ఎవరు ఇచ్చారు అంటూ బూతులు మాట్లాడుతూ బ్యానర్‌ని చింపేశారని, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వచ్చిన పోలీసులు వారిని బయటకు పంపించారని ఆరోపించారు. సదస్సు పూర్తయ్యాక బయటకు వెళ్లే సమయంలో సుమారు 60 మంది ఏబీవీపీ కార్యకర్తలు బయట వేచి ఉండి మమ్మల్ని అడ్డగించి బూతులు తిడుతూ చేతుల్లోని పుస్తకాలను లాక్కుని తమపై దాడి చేశారని తెలిపారు. అక్కడే ఉన్న పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరమని పేర్కొన్నారు. సమావేశంలో విప్లవ శ్రీనిధి, వద్దిరాజు ప్రవీణ్ కుమార్, స్కైబాబు పాల్గొన్నారు.

మూన్‌షైన్ పబ్ యజమానిపై క్రిమినల్ కేసు

ఫిలింనగర్: పబ్‌లో గొడవకు పాల్పడుతున్న వారిని నిర్లక్ష్యంగా రోడ్డు పైకి వదిలేసి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించడమే కాకుండా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-82లోని మూన్‌షైన్ పబ్ యజమానిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... శనివారం అర్ధరాత్రి మూన్‌షైన్ పబ్‌లో రాకేష్, సంతోష్‌లు అనే ఇద్దరు యువకులు గ్యాంగ్‌లుగా ఏర్పడి బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటుండటంతో ఇక్కడ బౌన్సర్లు రాజు, ఇస్మాన్, అలీలు వారందరినీ మద్యం మత్తులో ఉండగానే రోడ్డు పైకి నెట్టేశారు. దీంతో సంతోష్, రాకేష్‌తో పాటు మరికొందరు రోడ్డుపై న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. తమకు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం, పబ్ నిర్వహణలో లోపాలు కారణంగానే అర్ధరాత్రి పబ్ ఎదుట న్యూసెన్స్ ఏర్పడిందని, వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిలింనగర్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పబ్ యజమానితో పాటు బౌన్సర్లపై ఐపీసీ సెక్షన్290, 336 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్టార్టప్స్ ప్రోత్సాహం కోసం రూ.50కోట్ల నిధి ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక స్టార్టప్‌లలో రూ. 50కోట్ల వరకు పెట్టుబడి సహాయం అందించేందుకు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (వైఎఇ) మాగ్నిఫిక్ క్యాపిటల్ ట్రస్టీలు థైరోకేర్ సృష్టికర్త డాక్టర్ ఎ వేలుమణితో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. అందులో భాగంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు నగరంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాకర్ ఆలపాటి మాట్లాడుతూ, గత దశాబ్దకాలంగా స్టార్టప్‌లకు మద్దతు అందిస్తున్నామని, ఈ కొత్త ఫండ్ ప్రారంభం స్టార్టప్ వ్యవస్థ విస్తరణలో ఒక మైలురాయిగా పేర్కొన్నారు. భిన్న రంగాలలో ఆవిష్కరణలు చేస్తున్న స్టార్టప్స్ తమకు info@yeaindia.orgలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

సోలార్ ఉత్పత్తుల్లో విప్లవాత్మకమైన వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యామ్నాయ విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ ఉత్పత్తుల్లో అత్యాధునిక ఆవిష్కరణలు మరింత ఊపందుకోనున్నాయని నిపుణులు విశ్లేషించారు. పునరుత్పాదక విద్యుత్‌శక్తిపై మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రెన్యూఎక్స్ ఈవెంట్ ముగిసింది. ఈ సందర్భంగా సోలార్ ఉత్పత్తుల తయారీకి పేరొందిన ఎస్ఎమ్ఎ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఓ సమావేశంలో సంస్థ డైరెక్టర్ కరణ్‌సింగ్ సదస్సులో తమ భాగస్వామ్యం, సంబంధిత వివరాలను వెల్లడించారు. నగరంలో నిర్వహించిన ఈవెంట్‌లో సన్నీ ట్రై పవర్ కోర్ 2, సన్నీ హై పవర్ పీక్ 3 వంటి అత్యాధునిక ఉత్పత్తులను ప్రదర్శించామన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఓటర్లకు అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను అతికిస్తున్న సిబ్బంది
- మొత్తం 582 పోలింగ్ కేంద్రాలు.. 7,24,992 మంది ఓటర్లు



సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్‌కు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూచిక పోస్టర్లను అంటిస్తున్నారు. పాపయ్యయాదవ్‌నగర్ రెయిన్‌బో హైస్కూల్‌లో సోమవారం రెవెన్యూ అధికారి రేణుకాదేవి ఆధ్వర్యంలో బూత్ లెవెల్ సిబ్బందితో కలిసి ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేశారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 582 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రం, నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ నెంబర్, పోలింగ్‌స్టేషన్ పేరు, లొకేషన్, బూతు లెవెల్ సిబ్బంది పేరు, సదరు ఫోన్ నెంబర్ లతో పాటు సెక్టార్ ఆఫీసర్, పోలీస్ ఆఫీసర్ సీఐ/ఎస్సై, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్, కంట్రోల్ రూమ్ కాంటాక్ట్ నెంబర్ ఇలా పూర్తి వివరాలను కౌంటింగ్ కేంద్రం వద్ద స్టిక్కర్లను అంటించారు.

◆ నియోజకవర్గంలో మొత్తం ఇటీవల అధికారులు ఓటర్ల తుది జాబితాను విడుదల చేయగా 7,24,992 మంది ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో పురుషులు 3,78,362, మహిళలు 3,46,468 లక్షల మంది కాగా 162 మంది ఇతరులు ఉన్నారు. తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం 14,400 కొత్త ఓటర్లు నమోదు అయ్యారు .మొత్తం 582 పోలింగ్ కేంద్రాల తోపాటు అదనంగా మరో 10 కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు పేర్కొన్నారు.



పాపయ్యయాదవ్‌నగర్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో పోస్టర్లను అంటిస్తున్న అధికారులు

◆ 19 సంవత్సరాల లోపు ఉన్న ఓటర్లు 14,440 మంది, 29 సంవత్సరాల వారు 1,31,691, 39 సంవత్సరాల ఓటర్లు 2,25,626, 49 సంవత్సరాల వారు 1,79,058, 59 సంవత్సరాల ఓటర్లు 97,631, 69 సంవత్సరాల వారు 49,091, 79 సంవత్సరాల ఓటర్లు 22,276, 89 సంవత్సరాల వారు 4,440, 99 సంవత్సరాల ఓటర్లు 674, 109 సంవత్సరాల వారు 103, 119 సంవత్సరాల ఓటర్లు ఇద్దరు ఉన్నట్లు తాజాగా విడుదల చేసినా ఓటర్ గణాంకాలు చెబుతున్నాయి.

బీఆర్ఎస్, బీజేపీలు ఒకటే...



సుభాష్‌నగర్ డివిజన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనని, ఆ పార్టీలు ఎన్ని కుతంత్రాలు చేసినా మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా ఆయన సుభాష్‌నగర్ డివిజన్ పరిధి నరసింహ బస్తీ, పాండు బస్తీ, దయానంద్‌నగర్, సంతోష్‌నగర్, ప్రియాంకనగర్, కృషి కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో స్థానిక అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం మోకాలడ్డిందన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానం ఉందని తెలిపారు. సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రంగారావు, నాయకులు టైగర్ రాములు, కుమ్మరి శంకర్, సంజీవ్, వాణి, వినోదమ్మ, మస్తానమ్మ, నాగరాజు, బొబ్బ ప్రసాద్, గుబ్బల రమణ, రంగనాథ్, శ్రీనివాస్, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అకడమిక్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవం



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న స్కూల్ చైర్మన్ శివరాత్రి యాదగిరి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట మగ్దూమ్‌నగర్‌కు చెందిన చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం అకడమిక్ ఎక్సలెన్సీ అవార్డు-2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి చేతుల మీదుగా చదువుల్లో ప్రతిభ కనబరిచిన నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఇంటర్ ఫలితాల్లో సైతం తమ పాఠశాల పూర్వ విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

ప్రశ్నించినందుకు మా పైనే దుష్ప్రచారం

స్థల యజమాని అల్వాల్‌రెడ్డి

దుండిగల్: కొందరు వ్యక్తులు తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి దాడులకు పాల్పడుతున్నారని... ఇదేమని ప్రశ్నిస్తే కొందరు గ్రామస్తులు తమపైనే దుష్ప్రచారం చేస్తున్నారని స్థల యజమాని అల్వాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'జాగాలో పాగా' అనే కథనంపై ఆయన స్పందించారు. గాగిల్లాపూర్‌లోని సర్వే నం.235లో కరీముద్దీన్ అనే వ్యక్తికి గతంలో 7.05 ఎకరాల స్థలం ఉండేదన్నారు. వారి కుటుంబ సభ్యుల నుంచి పాపాయ్య, మల్లేష్, మరో వ్యక్తి 2006లో 2.18 ఎకరాలను కొన్నారు. తదనానంతరం వారు డాక్టర్ విజయలక్ష్మికి విక్రయించారన్నారు. ఆమె నుంచి 2023 మార్చి నెలలో తనతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు సదరు 2.18 ఎకరాలను కొనుగోలు చేశామని పేర్కొన్నారు. తమకు రిజిస్ట్రేషన్‌తో పాటు పాస్ బుక్కులు, ధరణీలో పేర్లు సైతం నమోదయ్యాయని తెలిపారు.

◆ తమకు చెందిన 2.18 ఎకరాలు కాకుండా గ్రామస్తులకు ఉన్న మూడు ఎకరాల్లో కొంత భాగం రోడ్డు విస్తరణలో పోయిందన్నారు. వారికి ప్రధాన రోడ్డుతో పాటు గ్రామానికి వెళ్లే రోడ్డులో స్థలం ఉందన్నారు. రోడ్డు విస్తరణ కారణంగా కోల్పోయిన స్థలాన్ని తమకు చెందిన 2.18 ఎకరాల్లో చూపిస్తున్నారని తెలిపారు. దీనికి తోడు సర్వే నం.235కి సర్వే నం.117కి ఎలాంటి సంబంధం లేదన్నారు. సర్వే నం.117లో జరిగిన వివాదంలో నలుగురు వ్యక్తులు జైలుకు వెళ్లారని తెలిపారు. వారితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

◆ తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి తమ పైనే దాడులు చేస్తూ తిరిగి తమపైనే చెడు ప్రచారం చేస్తున్నారని... వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా తమకు అధికార పార్టీ నేతలతో సంబంధాలు ఉన్నాయని కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని... వారిని ఇప్పటి వరకు తాను కలవలేదని తెలిపారు. తనకు ఎవరితోనూ పరిచయాలు లేవన్నారు. స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విషయాలు త్వరలోనే బయటకు వస్తాయని అల్వాల్‌రెడ్డి పేర్కొన్నారు.

మే 1వ తేదీన దీవెన పండుగ

నిజాంపేట్: కల్వరిగ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మే 1వ తేదీన సాయినగర్‌లోని సీజీఎం చర్చిలో దీవెన పండుగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రదర్ జార్జి బుష్ హాజరై ప్రసంగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కేఎం ప్రతాప్‌కు ఆహ్వానం

కుత్బుల్లాపూర్: సూరారం రాజీవ్‌గృహకల్పకు చెందిన కేకేసీ నాయకులు సోమవారం డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మే 1న నిర్వహించే కార్మికుల ప్రపంచ దినోత్సవానికి హాజరై జెండాను ఆవిష్కరించాలని కేకేసీ నాయకులు సంపత్‌రెడ్డి, రేఖ, ఖమ్రుద్దీన్ ఆహ్వానించారు. వారి వెంట జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, బిజిలి కృష్ణ, గార శ్రీనివాస్, షేక్ బాబు తదితరులు ఉన్నారు.

మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ విజయం ఖాయం

నిజాంపేట్: మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా నిజాంపేట్ 8వ డివిజన్ పరిధిలోని శ్రీనివాసం అపార్ట్‌మెంట్స్, తిరు సంకల్ప విల్లాస్, 7వ డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ పార్క్ ప్రాంతాల్లో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సునీతామహేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.



నిజాంపేట్ తిరు సంకల్ప విల్లాస్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు



దామద్వీప్ బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతోత్సవాల్లో పున్నారెడ్డి

సుభాష్‌నగర్: రాజ్యాంగంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి గాజులరామారం డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో దామద్వీప్ బుద్ధ విహార్‌కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ.. నిమ్నవర్గాల అభ్యున్నతికి పాటుపడిన అంబేడ్కర్ బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దామద్వీప బుద్ధవిహార్ కమిటీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి సతీష్ దండే, సభ్యులు సంతోష్ బన్సోడ్, సునీల్, రామ్, గణేష్, రమేష్, ప్రదీప్, సంతోష్, కిరణ్ మధుకర్, ఆనంద్, ముఖేందర్, ప్రొ. జయశంకర్‌నగర్ కాలనీ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు అన్వర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ ఉపేందర్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ తరగతుల 10వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. యువత ఉచిత డ్రైవింగ్‌లో శిక్షణ పొంది ఉపాధి వైపు పయనించాలన్నారు. కేశవ స్మృతి సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కొప్పారపు బాలయ్య, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



గాలిగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో శ్రీసీతారామచంద్ర ఆలయ గాలిగోపుర నిర్మాణానికి దూలపల్లికి చెందిన బూర్గుబావి దుర్గా, అశోక్ దంపతులు పెళ్లి రోజు సందర్భంగా సోమవారం ఒక లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌యాదవ్, శివకుమార్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరంలో సంగీత తరగతులు

చిక్కడపల్లి : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శ్రీసాయి నటరాజ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి సంగీత తరగతులు నిర్వహిస్తున్నామని అకాడమీ వ్యవస్థాపకురాలు గురు తులసి తెలిపారు. సోమవారం సాయంత్రం వివేక్‌నగర్‌లో ఆమె మాట్లాడుతూ.. మే 2వ తేదీ నుంచి ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కొనసాగుతాయన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు 9849265903.

ఘనంగా విద్యా సంవత్సర ముగింపు వేడుకలు


కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో సోమవారం 2023-24 విద్యా సంవత్సరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ సునీతలు కేక్ కట్‌చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా బాధ్యతతో పూర్తి చేయడంతో పాటు విద్యార్థుల్లో ప్రేరణ కలిగేలా ప్రోత్సహించి ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా విద్యా బోధనలో బిజీగా ఉండే ఉపాధ్యాయులు ఆట పాటలతో సందడి చేశారు.



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్

సీనియర్స్ 'మాట.. పాట' అదుర్స్

సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో మాట, పాట కార్యక్రమం



మాట పాట కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

పంజగుట్ట: వారంతా పదవీ విరమణ పొందిన వారు. ఆదివారం రాత్రి సుమారు 50 మంది అందరూ ఒక్కచోట కలుస్తారు. పాటలు, ఆటలు, మాటలతో యువకుల్లా మారిపోతారు. ఆనంద్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఏర్పాటు చేసుకుని ఆనంద్‌నగర్ కాలనీ మహిళా మండలిలో కళావేదిక ప్రాంగణం ఒకటి ఏర్పాటు చేసుకుని అక్కడ లైబ్రరీ, క్యారం బోర్డ్, చెస్ లాంటి ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. ఈ ఆదివారం మాట, పాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాతతరం సినీ నటులు సబిత (సప్తపది) హీరోయిన్, ఢిల్లీ రాజేషంలు వచ్చి వీరితో కలిసి మాట, పాట కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రోజూ సాయంత్రం సుమారు 20 మంది సీనియర్ సిటిజన్స్ ఇక్కడ కలుసుకుని లైబ్రరీలో పుస్తకాలు చదవడం, మంచి చెడు మాట్లాడుకోవడం, చెస్, క్యారం బోర్డు ఆడుతుంటామని ఫోరం సెక్రటరీ ఎన్.డి.ప్రభాకర్, అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు తెలిపారు.

కవులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : సమూహ కవులు, రచయితలపై ఏబీవీపీ దాడులు సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందచారి, రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్దన్, సహాయ కార్యదర్శి సలీమలు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆదివారం కాకతీయ యూనివర్సిటీలో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీతలు పసునూరి రవీందర్, మెర్సీ మార్గరెట్, కవి నరేష్‌కుమార్, టీవీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లుపై దాడి చేస్తూ.. చేయి చేసుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భగవద్గీత వేసవి తరగతులు ప్రారంభం

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీధర్మశాస్త సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత భగవద్గీత వేసవి తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయి గురుస్వామి, శ్రీలక్ష్మినారాయణ గురుస్వామి, ధనుష్ గురుస్వామిల ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణంతో పాటు శ్లోకాలు, వాటి అర్థాలను వివరించారు. ఈ తరగతులు 15 రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ వేసవి తరగతుల్లో స్థానిక చిన్నారులు, భక్తులు పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

ఎర్లీ బర్డ్‌కు నేడే ఆఖరు

కుత్బుల్లాపూర్: ఎర్లీ బర్డ్ పథకం ద్వారా ఐదు శాతం రాయితీ పొందే అవకాశం మంగళవారంతో ముగుస్తుందని జంట సర్కిళ్ల ఉపకమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఐదు శాతం రాయితీ పొంది, మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఇప్పటి వరకు తమ టార్గెట్‌ను పూర్తిచేసే దిశగా సంబంధిత రెవెన్యూ బిల్ కలెక్టర్‌లతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, గత సంవత్సరానికి మించి డబ్బులు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకొని ముందుకు సాగుతున్నారు.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం వ్యాపార వాణిజ్య సంస్థలు 63, 516 ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెల ఎర్లీ బర్డ్ కలెక్షన్ రూ.17.65 కోట్లు వసూలు అయ్యాయని అన్నారు.

◆ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ ఇప్పటి వరకు రూ.16.5కోట్లు వసూలు అయ్యాయని పేర్కొన్నారు. చివరి రోజు మంగళవారం గత సంవత్సరం వచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తామని ఉపకమిషనర్ నరసింహ తెలిపారు.

◆ గాజులరామారం సర్కిల్ మొత్తం 48 వేలకు పైగా వ్యాపార వాణిజ్య సంస్థలు ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.11. 31 కోట్లు రెవెన్యూ వసూలు కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో గత సంవత్సరం కంటే అధికంగా రూ.12.45 కోట్లు వసూలు అయ్యాయని ఉపకమిషనర్ మల్లారెడ్డి తెలిపారు.

◆ ప్రజలు ఎర్లీ బర్డ్‌ను ఉపయోగించుకొని ఐదు శాతం రాయితీ పొందాలని మంగళవారం చివరి రోజు రాత్రి 12 గంటల వరకు సిటిజన్ సర్వీస్ సెంటర్ తెరిచి ఉంటుందన్నారు. జంట సర్కిళ్ల పరిధిలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి కలెక్షన్ వసూలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు.



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో పన్నులు చెల్లిస్తున్న గృహ యజమానులు